క్లుప్తంగా

కర్ణాటక ముఖ్యమంత్రికి అధికారుల స్వాగతం



సీఎం సిద్ధరామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్

ఓర్వకల్లు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆయన బెంగుళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి రాయచూర్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన



సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కల్లూరు: ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఓబుళాపురం తండాలో సికిల్ సెల్ వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జన్యుపరమైన సమస్యలతో వంశపారంపర్యంగా సంభవించే రక్త హీనతే సికిల్ సెల్ అన్నారు. ఈ వ్యాధి కారణంగా రక్తహీనత, కామెర్లు, కీళ్లనొప్పులు, కాలేయ సమస్యలు, మూత్ర పిండాలు, పిత్తాషయంలో రాళ్లు, పక్షవాతం, ఛాతీ సమస్య, ఆయాసం, కడుపు నొప్పి లాంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. కొన్ని సందర్భాల్లో రక్తహీనత సమస్య పెరిగి చివరికి ప్రాణాలు పోయే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సిగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాణ్యం: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని నంద్యాల డీఈఓ జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించాలన్నారు. విద్యార్థుల మిత్ర కిట్ అందరికీ అందజేయాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ట



పూజలు చేస్తున్న కాటసాని ఉమామహేశ్వరమ్మ

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డులోని లక్ష్మీపురం గ్రామంలో శ్రీ చౌడేశ్వరి దేవి విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కర్నూలు(రూరల్): భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ టీ.వీ. రమేష్‌బాబుకు వినతిపత్రాలు అందజేశారు. ఉల్చాల, ఆర్.కె.దుద్యాల, దిన్నెదేవరపాడు, నందనపల్లె, నిడ్జూరు, గార్గేయపురం, నూతనపల్లె, పి.రుద్రవరం, పసుపుల తదితర గ్రామాలకు చెందిన రైతులు భూసమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలపై విచారణ జరిపి పరిష్కరించాలని తహసీల్దార్ వీఆర్వోలను ఆదేశించారు.

దొంగలు బాబోయ్!

- ఎర్రదొడ్డిలో 6 నెలల్లో 5 ఇళ్లలో చోరీలు
- పట్టపగలు తాళాలు పగులగొట్టి దోచుకుంటున్న దొంగలు
- ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాలంటే జంకుతున్న గ్రామస్తులు
- ఆదివారం రాత్రి గ్రామంలో వినాయకుడి విగ్రహం ఎత్తుకెళ్లేందుకు యత్నం
- జనం కేకలు వేయడంతో పారిపోయిన దుండగులు





ఎర్రదొడ్డి గ్రామంలో విచారణ చేస్తున్న పోలీసులు, దుండగులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన వినాయకుడి విగ్రహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామంలో దొంగలు పేట్రేగిపోతున్నారు. 6 నెలల వ్యవధిలో పట్టపగలు ఐదు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. గ్రామంలోని ప్రజలంతా వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు కావడంతో ఇళ్లకు తాళాలు వేసి పొలం, ఇతరత్రా పనులకు వెళితే గుట్టుచప్పుడు ఆ ఇళ్ల తాళాలు, బీరువాలను పగులగొట్టి దొరికిన కాడికి దోచుకెళుతున్నారు. ఇంటికి తాళం వేసిన కొద్దిసేపటికే తాళాలు పగులగొట్టి బంగారం, నగదును ఎత్తుకెళుతుండడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో ఇళ్లను విడిచి ఎక్కడికైనా వెళ్లాలంటే కుటుంబంలో ఎవరినో ఒకరిని ఇంటి వద్ద కాపాలా పెట్టి వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని ఎర్రదొడ్డి వాసులు వాపోతున్నారు.

వినాయకుడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నం

నిన్న మొన్నటి వరకు ఇళ్లను మాత్రమే టార్గెట్ చేసిన దొంగలు గత ఆదివారం రాత్రి ఎర్రదొడ్డి గ్రామంలోని ఆంజనేయుడి గుడి బయట ఉన్న ఓ వినాయకుడి విగ్రహాన్ని జీపులో ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. రాత్రి సమయంలో దొంగల అలికిడి విన్న జనం కేకలు వేయడంతో విగ్రహాన్ని అక్కడే వదిలేసి జీపులో పారిపోయారు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు గ్రామానికి చేరుకుని ప్రజలను విచారించడంతో పాటు, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఆలయం బయట పడి ఉన్న వినాయకుడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లేందుకు ఎందుకు ప్రయత్నించారో అర్థం కావడం లేదంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ఎర్రదొడ్డిలో గత 6 నెలల్లో జరిగిన చోరీల వివరాలు

- గత డిసెంబర్‌లో ఎర్రదొడ్డికి చెందిన మౌలాలి అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రిలో చేరాడు. కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లగా దుండగులు పట్టపగలు తాళాలు పగులగొట్టి, బీరువాను ధ్వంసం చేసి 3 తులాల బంగారం, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- 2024 మార్చిలో రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లగా దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న తులంన్నర బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- 2024 మార్చిలోనే చాకలి సత్యం అనే వ్యక్తి కూలి పనుల నిమిత్తం వేరే ఊరికి వెళ్లగా, ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి బీరువాలోని మూడు తులాల బంగారం, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు.
- 2024 మార్చిలోనే తిమ్మలమ్మ అనే వృద్ధురాలు కోడలు రంగమ్మతో కలిసి ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లగా, తాళాలు పగులగొట్టి ఇంట్లోని 4 తులాల బంగారం, కూలి పని చేసి కూడబెట్టుకున్న రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు.
- 2024 జూన్ 21న వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి వెళ్లగా, దుండగులు తాళాలు పగులగొట్టి 3 తులాల బంగారం, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు.

దొంగతనాలన్నీ పట్టపగలే!

ఎర్రదొడ్డి గ్రామంలో జరుగుతున్న దొంగతనాలన్నీ పట్టపగలే కావడం అవి కూడా తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేయడం గమనార్హం. ఇప్పటివరకు బంగారు ఆభరణాలు, నగదును మాత్రమే దొంగలు ఎత్తుకెళ్లారు. మిగిలిన విలువైన వస్తువులను ముట్టుకోలేదు. దీంతో దొంగలు ఒక ప్లాన్ ప్రకారమే చోరీలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. దొంగతనాలు జరిగిన సమయంలో పోలీసులు ఆయా ఇళ్లలో పరిశీలించి వెళుతున్నారే తప్పా ఇంతవరకు దొంగలను పట్టుకోలేదని, దీనివల్ల గ్రామంలో ఎప్పుడు ఏ ఇంట్లో చోరీ జరుగుతుందో తెలియని పరిస్థితుల మధ్య బతుకుతున్నామంటూ గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా పోలీస్ అధికారులు వరుస చోరీలకు పాల్పతున్న వారిని గుర్తించి తమ విలువైన వస్తువులకు రక్షణ కల్పించాలని ఎర్రదొడ్డి వాసులు కోరుతున్నారు.

కష్టపడి కూడబెట్టుకున్నదంతా ఎత్తుకెళ్లారు



భర్త, కుమారుడు చనిపోవడంతో కోడలు రంగమ్మతో కలిసి గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ మనవడిని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మూడు నెలల కిందట ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లగా పట్టపగలు దొంగలు పడి నాలుగు తులాల బంగారం, కూలినాలి చేసి కూడబెట్టుకున్న రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. కష్టపడి కూడబెట్టుకున్నదంతా దొంగలు పాలు కావడంతో దిక్కుతోచడం లేదు. పోలీసులు త్వరగా దొంగలను పట్టుకుని మా సొమ్ము తెచ్చిస్తే బాగుంటుంది. – **తిమ్మలమ్మ, బాధితురాలు, ఎర్రదొడ్డి**

ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే భయమేస్తోంది



మూడు నెలల కిందట ఇంటికి తాళం వేసి పనుల్లోకి వెళ్లగా గుర్తు తెలియని దుండగలు ఇంటి తాళాలు పగులగొట్టి తులంన్నర బంగారు నగలను ఎత్తుకెళ్లారు గ్రామంలో జరుగుతున్న దొంగతనాలను చూస్తే ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లాలంటేనే భయం వేస్తోంది. పోలీసు అధికారులు స్పందించి త్వరగా దొంగలను పట్టుకుంటేనే గ్రామస్తులు ప్రశాంతంగా ఉంటారు. – **రామాంజనేయులు, బాధితుడు ఎర్రదొడ్డి**

దొంగలను త్వరలోనే పట్టుకుంటాం

ఇటీవలే కోడుమూరు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించా. ఎర్రదొడ్డి గ్రామంలో జరుగుతున్న దొంగతనాలపై ఆరా తీస్తున్నాం. దొంగతనాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. గ్రామంలో కూడా పోలీసుల గస్తీ ఏర్పాటు చేశాం. త్వరలోనే దొంగలను పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తాం. – **ఎర్రిస్వామి, ఎస్ఐ, కోడుమూరు**

అర్హులైన సర్వేయర్లకు పదోన్నతి కల్పించాలి



డీటీ సతీష్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామ సర్వేయర్లు

ఓర్వకల్లు : అర్హతగల సర్వేయర్లకు పదోన్నతి కల్పించాలని గ్రామస్థాయి సర్వేయర్ల బృందం సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ల మండల అధ్యక్షులు నాగ శ్రీధర్‌గౌడు మాట్లాడుతూ.. గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో అర్హత గల వారందరికీ పదోన్నతి వచ్చేలా సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేయాలన్నారు. హేతుబద్ధీకరణలో భాగంగా రాష్ట్ర మొత్తం మీద మిగులు సిబ్బంది 4722 మంది సర్వేయర్ల భవిష్యత్తుపై సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు. సర్వేయర్ల సమస్యలను పరిష్కరించకపోతే జులై 25వ తేదీన దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం, వివిధ గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

కోడుమూరు రూరల్: కోడుమూరులో మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా పసుపు తాడు కట్టిన ఓ యువకుడిపై పోక్సో కేసు ఆదివారం రాత్రి నమోదు చేసినట్లు కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోడుమూరుకు చెందిన ఓ మైనర్ బాలికకు ఓ యువకుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి బలవంతంగా పసుపుతాడు కట్టాడు. జరిగిన విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కోడుమూరు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎర్రిస్వామి యువకుడితో పాటు, యువకుడికి సహకరించిన మహిళ, మరో వ్యక్తిపై పోక్సో, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, కిడ్నాప్ కేసులను నమోదు చేశారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నైట్‌వాచ్‌మన్‌లు

కర్నూలు(రూరల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నైట్‌వాచ్‌మన్‌లకు మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కర్నూలు ఎంఈఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరావు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1650 మంది శానిటేషన్ వర్కర్లు, 240 మంది నైట్ వాచ్‌మన్‌లు గత ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, వీరికి నెల నెలా వేతానాలు రాకపోతే ఎలా విధులు నిర్వహించాలని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వకుండా అధికారులు పనిభారం పెంచుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం తల్లికి వందనం పథకంలో భాగంగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు పాఠశాలల మెయింటెనెన్స్ కోసం జమ చేసుకున్నారని ఈ నిధులు జిల్లా కలెక్టర్ అకౌంటులో ఉన్నాయని, వాటితో శానిటేషన్ వర్కర్లకు, నైట్ వాచ్‌మన్‌లకు వేతనాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 30న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఆయాలు, నైట్ వాచ్‌మన్‌లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయాల యూనియాన్ జిల్లా నాయకులు సువార్త, నరసమ్మ, సుశీల, జయమ్మ, రాజు, విజయబాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



బహుమతులను అందుకుంటున్న విద్యార్థినులు

ఓర్వకల్లు : ఒలింపిక్ డే రన్‌ను పురస్కరించుకొని ఈ నెల 18, 19, 20 తేదీలలో కర్నూలులో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీలలో మండలంలోని కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ఎస్ఓ రాజేశ్వరమ్మ తెలిపారు. ఇందులో భాగంగా అంతర్ జిల్లా కబడ్డీ, షూటింగ్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రథమ బహుమతి, సెపతక్రాలో ద్వితీయ బహుమతి, చెస్, క్యారమ్, యోగా పోటీలలో ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. వీరికి సోమవారం ఒలంపిక్ డే రన్ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఈ ప్రభాకర్ చేతుల మీదుగా బహుమతులను అందజేసినట్లు చెప్పారు. విద్యార్థినుల విజయానికి కృషి చేసిన పీఈటీ వెంకటలక్ష్మికి, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థికి వీల్‌చైర్‌ను పంపిణీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ఓర్వకల్లు : స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. సోమవారం కేంద్రం ఐఆర్‌పీ టీచర్లు సీతారామయ్య, అంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్)లో ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్, ఎంఈఓ-1 శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఉపకరణాలను అందజేశారు. ఇందులో తెలుగు శ్రావణి, బి.హరి అనే విద్యార్థులకు వినికిడి యంత్రాలు, డి.రేష్మకు రొలేటర్, చంక కర్రను, ముల్లా అఫ్రీన్‌కు వీల్ చైర్‌ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, చిన్నారులకు పంపిణీ చేసిన ఉపకరణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకొని, ఆరోగ్య పరంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్‌ఎం హేమాంబర రెడ్డి, ఉయ్యాలవాడ ఐడీఎస్ఎస్ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): అతిసార వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. సోమవారం కర్నూలు నగరంలోని శ్రీరామనగర్ పరిధిలోని 59వ సచివాలయంలో నిర్వహిస్తున్న డయేరియా నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు డయేరియా కూడా ఒక ముఖ్యకారణమని, ఆశ కార్యకర్తలు తమ పరిధిలో పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల వాడకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పద్మావతమ్మ, రామలక్ష్మి, ఆశా కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.

28న రగ్బీ చాంపియన్‌షిప్

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి రగ్బీ జూనియర్ బాలబాలికల విభాగంలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇన్నోవటీస్ రీసెర్చ్ ల్యాబ్‌తో ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని ప్రముఖ విద్యా సంస్థ శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల హైదరాబాదులోని ఇన్నోవటీస్ రీసెర్చ్ ల్యాబ్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ డేవిడ్ సోమవారం తెలిపారు. ఒప్పందం ప్రకారం రెండు, మూడవ బీటెక్ విద్యార్థులకు పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్నోవటీస్ ప్రాంతీయ అధికారి వంశీకృష్ణ, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఫారూక్, సీఎస్‌డీ విభాగాధిపతి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంచార చికిత్స కేంద్రం తనిఖీ

కర్నూలు(రూరల్): మండలంలోని బి.తాండ్రపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి రఘు తనిఖీ చేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. గర్భిణులు రెండు డోసుల టీడీ వాక్సిన్‌తో పాటు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సచించారు. నూతన మాత శిశు సంరక్షణ కార్డు (ఎం.సీ.పీ.సీ)లో గర్భిణులు, బాలింతలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాలు వంటి విలువైన సమాచారంతో అందజేస్తామని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, జనని సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగే ప్రసవాలకు ఆర్థిక సాయం వంటి సంక్షేమ పథకాల వివరాలను సైతం కార్డులో పొందుపరుస్తారని వివరించారు. గ్రామాలలో మాతాశిశు సంరక్షణ కార్డు గురించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారి యశోధ, కృష్ణవేణమ్మ, ప్రాజెక్ట్ నిస్ట్ సయ్యద్ ఖలీల్ పాల్గొన్నారు.

బాల సదన్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడులో ఉన్న దామోదరం సంజీవయ్య బాల సదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సోమవారం తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో బాలల సంక్షేమం కొరకు, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీనీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. బాలసదన్‌లో పిల్లలకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య, సంరక్షణ గురించి తనిఖీ చేశారు.

ఆస్పత్రిని సందర్శించిన న్యాయమూర్తి

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని పెంచికలపాడు విశ్వభారతి హాస్పిటల్‌ను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని మానసిక దివ్యాంగుల విభాగాన్ని తనిఖీ చేసి వారితో మాట్లాడడంతో పాటు, వారికందుతున్న ఆహార, వైద్య సదుపాయాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మానసిక దివ్యాంగుల సంక్షేమానికై న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని న్యాయమూర్తి వారికి సూచించారు. హాస్పిటల్ డాక్టర్ మహేంద్రకుమార్, సైక్రియాటిస్ట్ శివశంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైన వారికి ఉద్యోగావకాశాలు

కర్నూలు (హాస్పిటల్): ఇంటర్ ఫెయిలైనవారికి జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ/డిప్లొమా పారా మెడికల్/నర్సింగ్/బీపీడీ కోర్సులలో ప్రవేశం నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు స్థానిక జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లో ఉన్న బొల్లినేని మెడి స్కిల్స్ 86865 94534, 76809 45357 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

'తల్లికి వందనం' ఎగ్గొట్టడం అన్యాయం



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఓర్వకల్లు : నిరుపేద తల్లులకు వందల ఎకరాల భూములు వున్నాయని ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టడం అన్యాయమని, తక్షణమే విచారణ జరిపించి అర్హులైన వారికి పథకం వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా బాధిత తల్లులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాగన్న మాట్లాడుతూ.. మండలంలోని మీదివేముల, నన్నూరు, లొద్దిపల్లె తదితర గ్రామాలకు చెందిన నిరు పేద మహిళల పేర్ల మీద భూములు వున్నాయనే సాకుతో ప్రభుత్వం తల్లికి వందనం పథకం ఎగరగొట్టిందని ఆరోపించారు. గ్రామాల్లో అత్యంత నిరుపేదల పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఇవ్వకుండా, పేదల పేర్లమీద వందల ఎకరాల భూములను నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు గుండమయ్య, ఆంజనేయులు, లింగేశ్వరుడు, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాఠశాలను యథాతథంగా కొనసాగించాలి



ఎంఈఓతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

కల్లూరు: కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, గట్టయ్య నగర్‌లో ఉన్న ఎంపీపీ పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల నాయకులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులును సీఐటీయూ నాయకులు, విద్యార్థుల తల్లింద్రులు కలిసి వినతి పత్రం అందించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గట్టయ్య నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదవ తరగతుల విద్యార్థులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న కస్తూరి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు తరలించడాన్ని ఎంఈఓ తక్షణమే రద్దు చేయాలన్నారు. ఒకపాఠశాల విద్యార్థులను మరొక పాఠశాలకు తరలించకూడదని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా కొంతమంది ఒత్తిడి మేరకు ఎంఈఓ సంతకాలు పెట్టించారని, తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరగలేదని చెప్పారు. తప్పుడు తీర్మానం చేసిన వారిని విచారణ చేసి యథాతథంగా పాఠశాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఉమా వెంకటలక్ష్మి, కవిత, భారతి, మహేశ్వరి, కావ్య, శ్రీలత, సీఐటీ యూ నాయకులు యేసు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సి.బెళగల్ పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: మండల ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటలక్ష్మి వీఆర్వోలను హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా సి.బెళగల్, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, కొత్తకోట, పోలకల్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తమ భూ సమస్యలను తెలుపుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా గొల్లలదొడ్డి గ్రామంలోని దేవదాయ భూములను అన్యక్రాంతం కాకుండా చూడాలని గ్రామ పెద్దలు తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించిన తహసీల్దార్ వీఆర్వోలతో మాట్లాడుతూ.. సరైన పత్రాలున్న అర్హులైన రైతుల భూములపై వారికి అన్ని రకాలైన హక్కులను కల్పించాలని, భూ సమస్యలపై నిర్లక్ష్యం వహించడం, రికార్డుల నిర్వహణపై అలసత్వంగా ఉండే రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీటీ పురుషోత్తం, ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్ఎస్‌డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన



టీబీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'టీబీ ముక్తా భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ సర్పంచు చంద్రగోవర్ధనమ్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రేఖా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 60 ఏళ్లు పైబడిన వారు, పొగతాగువారు, మద్యం సేవించువారు, పౌష్టికాహర లోపం గల వారిని గుర్తించాలన్నారు. వారిలో రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చమటలు పట్టడం, బరువు తగ్గిపోవడం లక్షణాలు వున్నట్లయితే గళ్ల పరీక్షలు, ఎక్సరేలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రాబర్ట్, టీబీ సూపర్‌వైజర్ నిషిత్ ఇమ్రాన్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, ఆరోగ్య కార్యకర్త షకీలాబి, ఎంఎల్‌హెచ్‌పీ సుకన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.